
# గోదావరి పుష్కరాలకు సమగ్ర రద్దీ నియంత్రణపై ప్రత్యేక కార్యాచరణ





✷ రాజమహేంద్రవరం--కొవ్వూరు లకు సమాన అభివృద్ధే లక్ష్యం

✷ కలెక్టర్ కీర్తి చేకూరి,ఎస్పీనరసింహ

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మే 13:**గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తులకు అసౌకర్యం కలగకుండా, అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సమగ్ర రద్దీ నియంత్రణపై ప్రత్యేక కార్యాచరణ
వ్యవస్థను అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు.

బుధవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో చెన్నై యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ బృందంతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న బృంద సభ్యులు పాల్గొన్నారు. ముందస్తు ప్రణాళికల వల్ల పుష్కరాల నిర్వహణ సమర్థవంతంగా సాగుతుందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తుల భద్రత, ట్రాఫిక్, పారిశుద్ధ్యం, అత్యవసర సేవలు, ఘాట్‌ల నిర్వహణ తదితర అంశాలపై సమగ్ర కార్యాచరణ అవసరమన్నారు. రియల్‌టైమ్ క్రౌడ్ మేనేజ్‌మెంట్ అమలు చేసే ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అన్ని ఘాట్‌లను "పుష్కర ఘాట్‌లు"గా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కోటిలింగాల ఘాట్ వంటి విశాల ప్రదేశాలకు మళ్లింపు టెక్నాలజీ ఆచరణకు చర్యలు తీసుకోవాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలన్నారు.

జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ మాట్లాడుతూ, రాజమహేంద్రవరం తో పాటు కొవ్వూరు వైపు కూడా సమాన స్థాయిలో అభివృద్ధి చేసి భక్తులను మళ్లించే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ట్రాఫిక్‌ను గుర్తించి షటిల్ బస్సులు, నడక మార్గాల ద్వారా ఘాట్‌లకు తరలించే చర్యలు చేయనున్నట్లు చెప్పారు.

జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ మాట్లాడుతూ, వివిధ సెక్టార్లలో క్షేత్రస్థాయిలో ప్రాథమిక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ, గత పుష్కరాల సమయంలో విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో అమలైన క్రౌడ్ మేనేజ్‌మెంట్ విధానాలను అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. నగరంలో 17 ఎంట్రీ పాయింట్ల ద్వారా వచ్చే భక్తుల రద్దీని నియంత్రించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. చెన్నై బృంద సభ్యులు , కాతేరు, నగరంలోని ప్రధాన రహదారులు, పుష్కర్ ఘాట్, కోటిలింగాల ఘాట్, పుష్కర్ నగర్, సరస్వతి ఘాట్ లను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి అధ్యయనం చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి జూన్ 10 నాటికి సమగ్ర నివేదిక అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి టి సీతారామ మూర్తి, పుష్కర ప్రత్యేక అధికారులు ఎన్. మనోజ్, డా. ఏ. మహేష్, చెన్నై బృంద సభ్యులు పూనమ్, రవిశంకర్, రమేష్, పార్థిబా, ప్రియదర్శిని, రెవెన్యూ పోలీసు ఇరిగేషన్, పంచాయతీ రాజ్, ఆర్ ఎమ్ సి, మున్సిపల్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.




# మాదకద్రవ్యాల నిర్మూలనకు సమన్వయంతో చర్యలు




**– కలెక్టర్ కీర్తి చేకూరి , ఎస్పీ నరసింహ కిషోర్**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మే 13:**జిల్లాలో మాదకద్రవ్యాలు కట్టడి చేయడంలో విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, యాజమాన్యాలు పోలీస్ అధికారులతో సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి విజ్ఞప్తి చేశారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎన్‌కోర్డ్ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల్లో విద్యార్థులు మత్తు పదార్థాలు వినియోగం పై ఉపాధ్యాయులు, ప్రత్యేక నిఘా, కౌన్సిలింగ్ నిర్వహించాలని , తల్లిదండ్రులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యాసంస్థల్లో "నషాముక్త భారత్" పై మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు, ప్రతిజ్ఞ చేయించాలన్నారు. హాస్టళ్ల విద్యార్థులపై వార్డెన్లు కఠిన నిఘా పెట్టాలన్నారు. విద్యాసంస్థలు, హాస్టళ్ల పరిసరాల్లో పొదలను తొలగించి లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈగల్ టీం,శక్తి టీంలకు సమాచారం అందించా లన్నారు. విద్యాశాఖ అధికారులు పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించా లన్నారు. నగర శివారు ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి సేవించే హాట్‌స్పా ట్‌లను గుర్తించి సంబంధిత శాఖల అధికారులు పోలీస్ శాఖతో సమన్వయం తప్పని సరన్నారు. జిల్లా ఎస్పీ డీ. నరసింహ కిషోర్ మాట్లాడుతూ, మార్చి నెలలో జరిగిన ఎన్‌కోర్డ్ సమావేశం నుండి ఇప్పటివరకు రూ. 13.66 లక్షల విలువైన 25 కిలోల గంజాయిని స్వాధీనం పాటు 10 వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. జిల్లాలో గంజాయి నిర్మూలన కోసం ఈగల్ టీంలను ఏర్పాటు చేసి, డ్రోన్ల నిఘా తో దాడులు నిర్వహిస్తు న్నామన్నారు. ఈగల్ టీంల ఆధ్వర్యంలో మెడికల్ షాపులపై దాడులు నిర్వహించి, నిషేధిత మందులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాలేజీలు, హాస్టళ్ల బస్ డ్రైవర్లు, ఆటో డ్రైవర్ల ప్రవర్తనపై కూడా నిఘా ఉంచాలని సూచించారు. మాదకద్రవ్యాలు సేవించిన వారిని గుర్తించేందుకు ప్రభుత్వం 500 టెస్టింగ్ కిట్లను సరఫరా చేసిందన్నారు.ఎక్సైజ్ , రైల్వే శాఖలు బృందాలు ఏర్పాటు చేసుకుని మాదకద్రవ్యాలు తరలించే వారిపై పిట్-ఎన్‌డీపీఎస్ చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ నరసింహ కిషోర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, పోలీస్ శాఖ, అటవీ శాఖ, రైల్వే శాఖ, విద్యాశాఖ, ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్ మెంట్, ఈగల్ టీం, శక్తి టీం, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బిసి సంక్షేమ, రవాణా, ఆర్టీసీ, పిపాఠశాల విద్య, ఇంటర్మీడియట్ , డిగ్రీ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఇతర సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సర్వేలు వేగవంతం చేయాలి





✷ పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం

✷ రంపచోడవరం డిడిఓ వెంకట నారాయణ

**గంగవరం, పెన్ పవర్ మే 13:** సర్వే పనులను సమయానికి పూర్తి చేసి ప్రభుత్వ లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని రంపచోడవరం డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ వెంకటనారాయణ సూచించారు.మండల కేంద్రం గంగవరం సచివాలయాన్ని రంపచోడవరం డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయం పరిధిలో జరుగుతున్న వివిధ సర్వే పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ప్రధానంగా జనగణన (సెన్సస్) సర్వే పురోగతిని పరిశీలించిన ఆయన, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఫీల్డ్ సర్వే పనులను స్వయంగా పర్యవేక్షించారు. సర్వే ప్రక్రియలో వేగం, ఖచ్చితత్వం పాటించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.పంచాయతీ పరంగా 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటిపన్ను వసూళ్లపై కూడా ఆయన దృష్టి సారించారు. మే 1 నుండి మే 31 వరకు ఇంటిపన్ను చెల్లింపుపై ప్రభుత్వం అందిస్తున్న 5 శాతం రాయితీ విషయాన్ని ప్రజలకు విస్తృతంగా తెలియజేసి, సకాలంలో పన్ను వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. రాయితీ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అదేవిధంగా గ్రామంలో శానిటేషన్ (పారిశుధ్యం), త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

# గిరిజన సంక్షేమ పథకాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు

✷ మే 18 నుంచి 25 వరకు ప్రత్యేక ఐఈసీ ప్రచార కార్యక్రమాలు

✷ జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్




**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ,మే 13 :** జిల్లాలోని సంబంధిత ఐటీడీఏ పరిధిలో పీఎం జన్మన్ , ధర్తి ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకాల అమలుపై విస్తృత అవగాహన కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు."జన్ భాగీదారి -- సబ్సే దూర్, సబ్సే పహలే" పేరుతో మే 18 నుంచి 25 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించే ఐఈసీ ప్రచార కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల అమలుకు రంపచోడవరం ఐటీడీఏ ఏపీవో డివిఎస్ రమణను జిల్లా స్థాయి నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు.పోలవరం జిల్లా స్థాయి అమలు కార్యాచరణ ప్రణాళికను మే 15 నాటికి సిద్ధం చేసి సంబంధిత శాఖలకు పంపాలని కలెక్టర్ ఆదేశించారు. గిరిజనులు, ముఖ్యంగా పీవీటీజీలు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో పొందేలా గ్రామస్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని సూచించారు.ఆదిసేవా కేంద్రాల ద్వారా జనసునవాయ్ కార్యక్రమాలు నిర్వహించి ప్రజల ఫిర్యాదులు, సమస్యలు నమోదు చేయాలని పేర్కొన్నారు. అర్హులైన వారికి హక్కులు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడంతో పాటు ఆరోగ్య పరీక్షలు, సికిల్ సెల్ ఎనీమియా పై అవగాహన, పోషకాహార పదార్థాలపై ప్రచారం చేపట్టాలని తెలిపారు.గిరిజన యువత, మహిళా పారిశ్రామికవేత్తలు, జీవనోపాధి రంగంలో రాణిస్తున్న వారి విజయగాథలను నమోదు చేసి విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత క్షేత్రస్థాయి అధికారులు పత్రికా ప్రకటనల ద్వారా, అలాగే మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.అదేవిధంగా ప్రచార కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు, వివరాలను కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని, సోషల్ మీడియా వేదికల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు.


# కూలితేకాని..పట్టించుకోరా?



**ఏలూరు మే13 పెన్‌పవర్ :** దెందులూరు నియోజక వర్గం పాతముప్పర్రు పంచాయితీ పరిధిలోని చెరువుల పాకల కాలనీకి వెళ్లే వంతెన శిధిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది.కాలనీలో సుమారు 100 కుటుంబాలు నివశిస్తున్నాయి.కాలనీ ఏర్పడి 30 ఏళ్లు కావస్తున్నా అక్కడ నివశిస్తున్న కాలనీ వాసులు ప్రమాదకరంగా మారిన వంతెనపై బిక్కు బిక్కు మంటూ నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు.వంతెన నిర్మాణానికి పంచాయితీ పాలక వర్గం ఎటువంటి ప్రతిపానలు చేయకపోగా, పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఆ గ్రామాన్ని సందర్శించి తమకేమి ప్రతిపాదనలు రాలేదని మిన్నకుండి పోయారు.ప్రజా ప్రతినిధులను కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రస్తుతం తమ వద్ద నిధ్ద నిధులు లేవని కాలం వెళ్ల దీస్తున్నారు.అధికారులు,ప్రజా ప్రతినిధులు స్పందించి శిధిల వంతెనను తొలగించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.




# చింతూరులో బీజేపీ నాలుగు మండలాల సమావేశం



**ఎస్ఎల్ఆర్ ఇంటెన్సివ్ అవగాహన బిఎల్ఏ 2ల నియామకంపై చర్చ**

**చింతూరు, పెన్ పవర్, మే 13:**చింతూరు మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చింతూరు డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్ఎల్ఆర్ ఇంటెన్సివ్ కార్యక్రమంపై పార్టీ నాయకులకు అవగాహన కల్పించడంతో పాటు బిఎల్ఏ 2ల నియామకంపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ఎల్ఆర్ ఇన్‌చార్జులు బుల్లి కొండల దొర, నాలుగు మండలాల ఇన్‌చార్జులు నోముల రామారావు, నారాయణమ్మ హాజరయ్యారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని వారు సూచించారు. గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, బూత్ స్థాయిలో బీజేపీని మరింత బలపరచాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, శక్తి కేంద్ర ప్రముఖులు, మాజీ మండల అధ్యక్షులు, జిల్లా మరియు రాష్ట్ర స్థాయి బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకులు, మోర్చా అధ్యక్షులు, పదాధికారులు, సీనియర్ నాయకులు, బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, రానున్న కార్యక్రమాలు, సభ్యత్వ విస్తరణ, బూత్ కమిటీల ఏర్పాటుపై కూడా నాయకులు దిశానిర్దేశం చేశారు.

# ఉక్కబోత.. దోమల మోత

- ప్రస్తుతం వేసవి ఎండలు మండిపోతున్నాయి. భానుడి ప్రతాపం ఓ పక్క ఉక్కబోత, మరోపక్క రాత్రిపూట దోమల బెడదలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. పెదపాడు మండలం లోని గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. దీంతో తెల్లారే వరకు కంటిమీద కునుకు లేకుండా పోతోందని ప్రజలు వాపోతున్నారు.
- పల్లెల్లో అధ్వానంగా పారిశుధ్యం



**ఏలూరు మే 13 పెన్ పవర్ :** పెదపాడు మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు 9 మంది ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. నెల రోజులు గడుస్తున్నా కొంతమంది ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటించిన దాఖలాలు లేవు. దీంతో పట్టించుకునే వారు లేక పారిశుధ్యం అటకెక్కింది. పునుకొల్లు, అప్పన వీడు గ్రామాల్లో అపరిశుభ్రత నెలకొని పందులు స్వైర విహారం చేస్తున్నాయి. పాత ముప్పర్రు, జయపురం గ్రామాల్లో అపరిశుభ్రత, తాళ్ల గూడెం మురుగు కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతుంది. సకల కొత్తపల్లి, వీరమ్మ గుంట పంచాయతీ పరిధిలోని వెంకటాపురం, పెదపాడు పంచాయతీ పరిధిలోని రామచంద్రపురం గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

**తూతూ మంత్రంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛ్ ఆంధ్ర**

గ్రామీణ ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతి బుధవారం 'స్వర్ణాంధ్ర స్వచంద్ర'కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు, వారానికోసారి పారిశుధ్య చర్యలు చేపట్టాలి. కానీ అధికారులు ఈ కార్యక్రమాన్ని నామమాత్రంగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్కడ చెత్త తొలగించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక అధికారుల పాలన ఎందుకు అంటూ ప్రశ్నిస్తున్నారు. కొన్ని గ్రామపంచాయతీలలో దోమల పిచికారి యంత్రాలు (ఫాగింగ్ మిషన్ లు) అందుబాటులో లేవు. దీంతో కొన్ని గ్రామాల్లో వ్యవసాయదారుల నుండి స్ప్రెయిర్లు అద్దెకు తీసుకొని దోమల మందు పిచికారీ చేస్తున్నారు.

**దోమల నివారణకు చర్యలు చేపడతాం**

–అనిల్ జమ, ఎంపీడీవో

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య చర్యలు చేపడుతాం. ప్రతి గ్రామంలో ప్రత్యేక అధికారులు పర్యటించేలా చూస్తాం. ఇదివరకే చెత్తను ట్రాక్టర్ల ద్వారా తరలించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం. ప్రజల ఇళ్ల పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. దోమల నుంచి కాపాడుకోవడానికి దోమతెరలు వాడాలి.

## అమ్మపాలెం గ్రామంలో స్వచ్ఛపథం కార్యక్రమం




**ఏలూరు మే 13 పెన్ పవర్ :** ప్రతి బుధవారం ప్రతిస్టాత్మకంగా నిర్వహించే స్వచ్ఛపథం కార్యక్రమంలో భాగంగా పెదవేగి మండలం అమ్మపాలెం గ్రామం లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టడం జరిగింది,ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి అధికారి ఎన్.రవికిషోర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు మేరకు గ్రామంలో రహదారులపై ప్లాస్టిక్,గార్బేజ్,ఎక్కడ లేకుండా,డ్రైనేజీ లో పూడికలు గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులతో నిర్వహించామన్నారు .

ప్రతి రోజు ఇంటింటికి చెత్త సేకరణ వాహనం వచ్చినప్పుడు,తడి –పొడి చెత్త వేరు చేసి ఇవ్వవలసినదిగా ప్రజలకి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పోలిశెట్టివీరయ్య, చందు, గంగాధరరావు,పామర్తి.శ్రీనివాస్,పార్టీ శ్రీనివాస్, స్వర్ణ గ్రామం సిబ్బంది వెల్ఫేర్ అసిస్టెంట్ మురళి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శిరీషా,ఆహా –మాధవి, గుమస్తా మేడంకి.కామేష్,గ్రామనాయకులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు

## రవాణాకు సిద్ధంగా ఉన్న తాటి కలప

- పట్టించుకోని రెవెన్యూ శాఖ సిబ్బంది
- గేట్లు ఎత్తేస్తున్న అటవీ శాఖ





**వై రామవరం, పెన్ పవర్, మే 13:** మండలంలో నుండి తాటి కలప అక్రమ రవాణా జరుగుతున్న రెవెన్యూ సిబ్బంది పట్టించుకున్న దాఖలాలు లేవని, అటవీ శాఖ గేట్లు ఎత్తేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

మండలంలో పలు గ్రామాల నుండి ఏ విధమైన అనుమతులు లేకుండా కాల్పువృక్షమైన తాటి చెట్లను యదేచ్చగా నరికి వేస్తున్నారని స్థానికులు అంటున్నారు. కల్పవృక్షమైన తాటి చెట్టును నరకడానికి రెవెన్యూ సిబ్బంది అనుమతి తప్పనిసరి. కానీ అక్రమ కలప రవాణా దారులు సంబంధిత సిబ్బందికి ముడుపులు చెల్లించి రాత్రి సమయంలో మైదాన ప్రాంతాలకు రవాణా చేస్తున్నారని పలువురు అంటున్నారు. గతంలో అటవీశాఖ సిబ్బంది తాటి కలప రవాణాపై కేసులు నమోదు చేసిన దాఖలాలు కూడా ఉన్నాయని అంటున్నారు. నాడు కేసులు పెట్టిన అటవీశాఖ నేడు అక్రమ తాటి కలప రవాణాకు సహకరిస్తుందని అంటున్నారు. రైతు వద్ద నుండి ఒక్కొక్క తాటి చెట్టు 100, 200 రూపాయలు కొనుగోలు చేసి వేలాది రూపాయల అర్జిస్తున్నారని స్థానికులు అంటున్నారు. రెవెన్యూ సిబ్బంది కనుసన్నలలోనే తాటి కలప యదేచ్చగా రవాణా అవుతున్నదని స్థానికులు అంటున్నారు. రెవెన్యూ సిబ్బంది అనధికార పర్మిషన్, అటవీ శాఖ సిబ్బంది అక్రమ ట్రాన్స్పోర్ట్ అనధికార పర్మిషన్ ఉండడం వల్లనే అక్రమ కలప రవాణా దారులు ఏదేచ్ఛగా కలపను మైదాన ప్రాంతాలకు తరలించుకుపోతున్నారని పలువురు అంటున్నారు. ప్రస్తుతం మండలంలో పి. ఎర్రగొండ పంచాయతీ బూసిగడ్డ వద్ద, పనసల పాలెం గ్రామం దగ్గర ప్రధాన రహదారి ప్రక్కనే తాటి కలప రవాణాకు సిద్ధంగా ఉందని స్థానికులు తెలిపారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమంగా రవాణా అవుతున్న తాటి కలప ను నిరోధించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు.

# అధ్వానంగా కల్వర్టు



**ఏలూరు మే 13 పెన్ పవర్:** పెదపాడు మండలం పాత ముప్పర గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలకు వెళ్లే మార్గంలో కొన్నిచోట్ల కాలువలు, డ్రైనేజీలపై సిమెంటు పలకలు వేయకపోవడంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వ్యర్థాలను తొలగించకపోవడంతో మురుగు రోడ్లపైకి వస్తోంది. గ్రామంలోని వాళ్లు వార్డులలో ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తోంది. పంచాయతీ సిబ్బంది, ప్రత్యేక అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఫాగింగ్ లేక.. దోమలు ఆగక -అవస్థల్లో ప్రజలు



**ఏలూరు మే 13 పెన్ పవర్ :** పెదపాడు మండలంలోని గ్రామ సచివాలయాలకు గత ప్రభుత్వం జగనన్న స్వచ్ఛ సంకల్పం కింద గ్రామీణ ప్రాంతాల్లో ఫాగింగ్ చేసేందుకు సరఫరా చేసిన యంత్రాలు మూలనపడ్డాయి. రూ.25 వేల నుండి రూ 60 వేల వరకు వెచ్చించి పెదపాడు మండలం లోని సచివాలయాలకు 2022 సంవత్సరంలో అందించారు.అవి నేటికి ఉపయోగం లోకి వచ్చిన దాఖలాలు లేవు

**గ్రామాలు అపరిశుభ్రం**

నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేసినా మురుగునీటి కాలువలు నిర్మాణం చాలావరకు చేపట్టలేదు. దీంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోయి పారిశుధ్యం అధ్వానంగా తయారయింది. ఫలితంగా 80 శాతం గ్రామాల్లో అపరిశుభ్రత నెలకొంది. మురుగు కాలువలు శుభ్రం చేయక చర్చ చదవడం పేరుకుని దుర్వాసన రావడమే కాకుండా దోమల వ్యాప్తి చెందుతోంది. మురుగునీటి నిల్వలతో దోమలు ప్రబలి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. వనతాధికారులు

**చర్యలు సిబ్బందికి శిక్షణ లేదు**

సాగింది అంతరాల వినియోగంపై సిబ్బందికి శిక్షణ, సూచనలు, అందించలేదు. వీటి వినియోగానికి మలాథియాన్, డీజిల్ మిశ్రమం, పెట్రోల్ అవసరం. మురుగు కాలువలు, అపరిశుభ్రత ప్రాంతాల్లో ఒక్కోసారి ఫాగింగ్ చేయాలంటే వేలల్లో నిధులు అవసరం. ప్రస్తుతం ఆర్థిక లోటితో సతమతమవుతున్న గ్రామ సచివాలయాల్లో ఇంత మొత్తం వినియోగించలేని పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో ఫాగింగ్ ఎంత సహాయంతో దోమల నివారణ చర్యలు చేపట్టి, గ్రామాల్లో ఫాగింగ్ చేయడంతో పాటు, ప్రత్యేక దృష్టి సారించి వ్యాధులు వ్యాపించకుండా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

## ఉయ్యాలమడుగు గ్రామంలో తాగునీటి తీవ్ర సంక్షోభం

**రెండు నెలలుగా నిలిచిపోయిన వాటర్ ట్యాంక్ -- కాలువ నీటిపైనే గ్రామస్తుల ఆధారం**



**గంగవరం ,పెన్ పవర్, మే 13:** పోలవరం జిల్లా గంగవరం మండలం పిడతమామిడి పంచాయతీలో గల ఉయ్యాలమడుగు గ్రామం లో గత రెండు నెలలుగా గ్రామ వాటర్ ట్యాంక్ పనిచేయకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్రమైన తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. గ్రామానికి ప్రధాన ఆధారంగా ఉన్న తాగునీటి మోటార్ చెడిపోవడంతో నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో గ్రామంలో మంచినీటి కొరత మరింత తీవ్రమైంది. తాగడానికి సరిపడా స్వచ్ఛమైన నీరు అందుబాటులో లేకపోవడంతో మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు దూర ప్రాంతాలకు వెళ్లి కాలువల నుండి నీటిని తెచ్చుకుంటున్నారు. కొన్ని కుటుంబాలు ఉదయం నుంచే బిందెలతో కాలువల వద్దకు వెళ్లి గంటల తరబడి నీటి కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.గ్రామస్తుల వివరాల ప్రకారం, వాటర్ ట్యాంక్‌కు సంబంధించిన మోటార్ రెండు నెలల క్రితమే రిపేర్‌కు గురైనప్పటికీ ఇప్పటివరకు అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని వారు తెలిపారు.కాలువల నీటిని వినియోగించడం వల్ల అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు మరియు వృద్ధులకు నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు సోకే అవకాశం ఉందని గ్రామ పెద్దలు చెబుతున్నారు.గ్రామ ప్రజలు మాట్లాడుతూ, "వేసవిలో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి మోటార్‌ను మరమ్మతు చేసి గ్రామానికి మంచినీటి సరఫరా పునరుద్ధరించాలి" అని విజ్ఞప్తి చేశారు.స్థానిక ప్రజాప్రతినిధులు మరియు గ్రామ పంచాయతీ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని ఉయ్యాలమడుగు గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య నుంచి ఉపశమనం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సమతుల్య ఎరువులు యాజమాన్యంపై శిక్షణ






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మే 13:**సమతుల్య ఎరువులు యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమము డాక్టర్ వైయస్సార్ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం వెంకటరమణ గూడెం వారు సమతుల్య ఎరువుల యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమం కె. అమరపేట గ్రామంలో , భీమడోలు మండలం ఏలూరు జిల్లా లో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ డాక్టర్ ఈ రేఖ శాస్త్రవేత్త ఉద్యాన విభాగం సమతుల్య ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. రైతులకు రసాయనకి ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను,జీవన ఎరువులను, ఎరువులు మరియు వర్మీ కంపోస్ట్ వాడుకొనమని సూచించారు. ఈ కార్యక్రమంలో 60 మంది రైతులు పాల్గొన్నారు.

## మండలంలో జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను పరిశీలించిన ఎంపీడీవో




**వై రామవరం, పెన్ పవర్, మే 13 :** మండలంలో జనాభా లెక్కల సేకరణ జరిగే గ్రామాలను ఎంపీడీవో కే బాపన్న దొర బుధవారం పరిశీలించడం జరిగిందని తెలిపారు. జనాభా లెక్కల సేకరణ చేసే అన్యుమరేటర్లు సూపర్వైజర్లు ప్రజలకు అర్థమయ్యే రీతిలో సక్రమంగా చేయాలని అన్నారు. యార్లగడ్డ, చింత కర్రపాలెం గ్రామాలలో జరిగే జనాభా లెక్క ల సేకరణను పరిశీలించిన జరిగిందని తెలిపారు. ఈనెల 15 లోపు 80 శాతం పూర్తి చేయాలని, 20వ తేదీ నాటికి నూరు శాతం జనాభా లెక్కలు పూర్తి చేయాలని ఆదేశించారు.

# అఖిలభారత కెమిస్టుల సమైఖ్య ఆధ్వర్యంలో 20 న దేశ వ్యాప్త సమ్మె

- ఆన్ లైన్ లో మందుల అమ్మకాలను నిలిపివేయాలి
- తూర్పుగోదావరి జిల్లా డ్రగ్ ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మే 13:**దేశ, రాష్ట్రవ్యాప్తంగా ఆన్ లైన్ లో మందుల అమ్మకాలను నిలిపివేయాలని, కార్పొరేట్ సంస్థల అధిక రాయితీలను నిలిపివేయాలని నకిలీ మందులను నివారించాలని తూర్పుగోదావరి జిల్లా డ్రగ్ ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ శ్రీనివాసరావు, కార్యదర్శి పిండి గణపతి విజ్ఞప్తి చేశారు. ఇవే డిమాండ్లతో ఈనెల 20 వ తేదీన
అఖిల భారత కెమిస్ట్ ల సమైక్య ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మె చేస్తున్నామని వారు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 12.40 లక్షల మంది కెమిస్టు నడుస్తున్నాయని వారిపై ఆధారపడి ఐదు కోట్ల మంది జీవనం సాగిస్తున్నారన్నారు. దేశంలో ఆన్లైన్ ఫార్మసీల పై కేంద్ర ప్రభుత్వ నియంత్రణ లేదని, ప్రజలు యువత అనుమతి లేని మందులు , డ్రగ్స్ విచ్చలవిడిగా లభ్యమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ల అధికారిక చీటీలు లేకుండా ఏంటి సెప్టిక్ మందులు ప్రజల ఆరోగ్యంతో చేలఘాటమాడుతున్నారన్నారు. కార్పొరేట్ మెడికల్ షాపులు 50 నుంచి 80 శాతం వరకు అధిక డిస్కౌంట్ లు ఇస్తూ సాధారణ మండల దుకాణం దారుల జీవనాన్ని దెబ్బతీస్తున్నారని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలను అతిక్రమిస్తూ మార్కెట్లో అవాంఛిత పోటీని పెంచుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు దేశంలో నకిలీ మందుల అమ్మకాలు గుట్టు గా సాగుతున్నాయని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించాలని రాష్ట్ర ఔషధ నియంత్రణ శాఖలో సిబ్బందిని పెంచాలన్నారు. గౌరవ అధ్యక్షుడు బలబద్ర వెంకటరాజు మాట్లాడుతూ కోవిడ్ సమయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన తాత్కాలిక నోటిఫికేషన్ జీవో జి ఎస్ ఆర్ 220 ను రద్దు చేయాలన్నారు. ఈ ఫార్మసీ కి సంబంధించిన 817 ఈ ను రద్దు చేయాలన్నారు. కార్పొరేట్ సంస్థల అధిక రాయితీలు కల్పించే లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ విధానాన్ని అమలు చేయాలన్నారు. 20 జరిగే నిరసన ప్రదర్శన ఆనం కళా కేంద్రం నుంచి నుంచి దేవి చౌక్ వరకు నిర్వహిస్తున్నట్లు ప్రజలు ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు పిల్ల బాల, సిహెచ్ ఫణీంద్ర, వై లీలాధర్, సత్య వరపూ సత్యనారాయణ మూర్తి, శ్రీనివాసరావు కరుణ కుమార్ గుప్తా సాధు ప్రసాదు పి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

# విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

- పదవ తరగతి మెరిట్ విద్యార్థులకు ఇంటర్ ప్రవేశానికి కౌన్సిలింగ్






**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మే 13:**విద్యా రంగానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ పాఠశాలల్లో చదువుకొని 2025 -- 26 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఇంటర్మీడియర్ కళాశాలల్లో ప్రవేశానికి నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్ లో బుధవారం కౌన్సిలింగ్ (విద్యోన్నతి) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రసంగిస్తూ. విద్యార్థులలో పరిజ్ఞానం పెంచడం, పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడంపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమకి నచ్చిన ఇంటర్మీడియట్ కళాశాలల్లో అతి తక్కువ ఫీజుతో ప్రవేశానికి 'విద్యోన్నతి క నగరపాలక సంస్థ అవకాశం కల్పిస్తోందన్నారు. నగర కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ ,విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభకు అహర్నిశలు కృషి చేసిన అధ్యాపక బృందాన్ని అభినందించారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 500 మార్కులకు పైగా సాధించిన 223 మంది విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. సహకరిస్తున్న ప్రైవేట్ కళాశాలల యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ఉత్తమ ఫలితాలు విద్యార్థులను మెమోంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ శైలజవల్లి, మేనేజర్ ఎండి అబ్దుల్ మలిక్, రెవెన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం పాల్గొన్నారు

## అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.35,000 విలువైన స్ట్రెచర్, కుర్చీలు బహుకరణ



**అత్తిలి, పెన్ పవర్ మే 13 :**అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో రోగుల సౌకర్యార్థం అవసరమైన రూ.35,000 విలువ గల స్ట్రెచర్‌తో పాటు కుర్చీలను 1982--83 బ్యాచ్ ఎస్వీఎస్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు బహుకరించారు. ప్రతి సంవత్సరం సమాజ సేవా కార్యక్రమాల్లో భాగంగా మంచి కార్యక్రమం చేపట్టే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈ సౌకర్యాలను అందించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, తమ పాఠశాల గుర్తుగా మరియు సమాజానికి ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆరోగ్య కేంద్రానికి అవసరమైన పరికరాలు అందించడం ద్వారా రోగులకు మరింత మెరుగైన సేవలు అందించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తీర్థాల శ్రీనివాస్, ముత్యాల జనార్దన్, ఆకుల ఆంజనేయులు, చీటికాన ఏడుకొండలు, కాసగాని ఏడుకొండలు, కొవ్వూరి హనుమంత్ రెడ్డి, గుత్తుందీవి రమేష్ తదితర పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే డాక్టర్ కె. నాగరాజు, డాక్టర్ ఆర్. సురేఖతో పాటు వైద్య సిబ్బంది పాల్గొని పూర్వ విద్యార్థుల సేవా భావాన్ని అభినందించారు. ఆరోగ్య కేంద్ర అభివృద్ధికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.




# ఊరంతా ప్రభుత్వ బడిలోనే...






**పెన్ పవర్ ఉంగుటూరు, మే 13:**ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలంలోని కైకరం శివారు గ్రామమైన రామన్నగూడెం ప్రభుత్వ విద్యపై విశేష నమ్మకాన్ని చాటుతూ ఆదర్శ గ్రామంగా నిలుస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపుదల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్న తరుణంలో, ఈ చిన్న గ్రామం అందరికీ స్ఫూర్తిదాయకంగా మారింది.
రామన్నగూడెం గ్రామంలో 5వ తరగతి వరకు బడిఈడు ఉన్న మొత్తం 41 మంది చిన్నారులు ఒక్కరైనా మినహాయింపు లేకుండా ప్రభుత్వ పాఠశాలలోనే నమోదు కావడం విశేషం. గ్రామంలోని తల్లిదండ్రులందరూ ప్రభుత్వ విద్యపై విశ్వాసం ఉంచి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించడం అభినందనీయం. ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపకుండా గ్రామమంతా ప్రభుత్వ బడినే ఎన్నుకోవడం ఆ గ్రామ ప్రత్యేకతగా నిలిచింది.
ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన ఉచిత విద్య, మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర వంటి సదుపాయాలు, మెరుగైన మౌలిక వసతులు, డిజిటల్ బోధనతో పాటు ఉపాధ్యాయుల అంకితభావం తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని పెంచాయి. ముఖ్యంగా గ్రామ ప్రజలతో ఉపాధ్యాయులు నిరంతరం మమేకమై విద్య ప్రాధాన్యాన్ని వివరించడం, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపడం వల్ల ప్రభుత్వ పాఠశాలపై మరింత ఆదరణ ఏర్పడింది.
"ఊరంతా ప్రభుత్వ బడిలోనే..." అనే నినాదానికి అక్షరాలా రూపం ఇచ్చిన రామన్నగూడెం గ్రామం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ప్రభుత్వ పాఠశాలలపై సమాజంలో పెరుగుతున్న విశ్వాసానికి ఇది నిదర్శనంగా చెప్పుకోవచ్చు.
ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ విద్యకు దన్నుగా నిలుస్తున్న గ్రామ పెద్దలను ఏలూరు ఉప విద్యాశాఖ అధికారి మరియు ఉంగుటూరు మండల విద్యాశాఖాధికారి-1 నిమ్మగడ్డ రవీంద్ర భారతి శాలువాలతో సత్కరించారు. అలాగే ఉపాధ్యాయులు తోట రాజు, యు.సూరి బాబు గార్ల కృషిని అభినందించి పాఠశాలకు స్టీల్ వాటర్ డిస్పెన్సర్ ను వితరణగా అందచేశారు.
ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మండల విద్యాశాఖాధికారి-2 పయ్యావుల సాయిబాబు, కైకరం పాఠశాలల సముదాయ ప్రధానోపాధ్యాయులు చేబ్రోలు శ్రీనివాస కుమార్, మరియమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విప్రోలో నాన్ ఐటి కి 40 మంది ఆదిత్య విద్యార్థులు ఎంపిక




**రాజమహేంద్రవరం పెన్ పవర్, మే 13:**స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు విప్రో లో నాన్ ఐటి ఉద్యోగాలకు 40 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.లక్ష్మీ సరోజ చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో విప్రో లో 40 మంది కి వార్షిక ఆదాయం 2.3 లక్షల తో ఉద్యోగం సాధించటం ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి విద్యా ప్రణాళిక కార్యాచరణ కారణమని ఆమె తెలిపారు. అమెజాన్ వెబ్ సర్వీస్, రెడ్ హాక్ అకాడమీ వంటి ప్రముఖమైన 11సంస్థలతో ఒప్పందం కుదుర్చుకోవడం వలన ఈ విజయం లభించిందనీ ఆమె చెప్పారు. ఈ విద్యా సంవత్సరం అటానమస్ హోదా లభించడం వలన ఎన్నో ఉద్యోగాలు విద్యార్థులు పొందే అవకాశం ఉన్నదన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 473 మంది విద్యార్థులు 950 ఉద్యోగాలు సాధించారన్నారు. ఆదిత్య విద్యార్థులు ఎన్నో సంవత్సరాల నుండీ ఉద్యోగాలు పొంది, ఆదిత్య సత్తాను చాటుకోవడం కూడా పరిపాటనీ ప్రిన్సిపాల్ శ్రీమతి లక్ష్మీ సరోజ తెలియజేశారు. రాజమండ్రి బ్రాంచ్ లో 40 మంది విప్రోలో ఉద్యోగాలు సాధించినందుకు ఆదిత్య డిగ్రీ పీ.జీ విద్యాసంస్థల సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి, కోఆర్డినేటర్ బి.ఇ.వి.ఎల్. నాయుడు విద్యార్థులను, ప్రిన్సిపాల్ ను,సీ. ఆర్. టి.టీమ్ ను అభినందించారు

## బోర్నగూడెం డైట్‌లో ఉపాధ్యాయుల వర్క్‌షాప్



- హాజరు శాతం పెంపుపై దృష్టి:
- గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్

**గంగవరం /రంపచోడవరం పెన్ పవర్ మే 13:**బోర్నగూడెం డైట్ కళాశాలలో నిర్వహించిన గిరిజన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల వర్క్‌షాప్‌లో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేవిపట్నం, రంపచోడవరం మండలాలకు చెందిన గిరిజన ప్రాథమిక పాఠశాల సుమారు 90 మంది ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, రానున్న విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులు మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ అవసరమని తెలిపారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, వంద శాతం హాజరు సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని మెరుగుపరచేందుకు తరగతి గదిలో వినూత్న బోధనా పద్ధతులు అవలంబించాలని ఆయన సూచించారు. సమయపాలన, పాఠ్య ప్రణాళిక అమలు, విద్యార్థులపై వ్యక్తిగత దృష్టి వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఓ ఎస్ డి బి.ఎస్. కుమార్ సర్వీస్ రూల్స్‌పై అవగాహన కల్పించగా, ఏ టి ఓ భారంగి చినబాబు పరిపాలనా అంశాలను వివరించారు. సీఎంఓ మంగిరెడ్డి, సూపర్ 50 సూపర్‌వైజర్ బొండ్ల వర ప్రసాదరావు, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ముంగారు చిన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులోకి దీపం ఎల్పిజి కనెక్షన్ల బదిలీకి టీటీవి సదుపాయం



జిల్లా సివిల్ సప్లై అధికారి విజయభాస్కర్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, మే 13 :** పోలవరం జిల్లాలో దీపం పథకం ఎల్పిజి గ్యాస్ కనెక్షన్ల బదిలీకి టీటీవి సదుపాయం అందుబాటులోకి వచ్చినట్లు జిల్లా సివిల్ సప్లై అధికారి విజయభాస్కర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఈ విషయాన్ని వెల్లడించారు. దీపం పథకం లబ్ధిదారులు తమ సంబంధిత గ్యాస్ ఏజెన్సీలను సంప్రదించి ఆధార్ కార్డు సమర్పించినట్లయితే టీటీవి జారీ చేయబడుతుందని ఆయన పేర్కొన్నారు. జారీ చేసిన టీటీవితో ఎల్పిజి గ్యాస్ కనెక్షన్లను సంబంధిత ఏజెన్సీలలో సులభంగా బదిలీ చేసుకోవచ్చని తెలిపారు. అవసరాన్ని బట్టి సిలిండర్, గ్యాస్ స్టవ్ తీసుకురావాలని సూచించారు. గ్యాస్ కనెక్షన్లకు సంబంధించిన సందేహాల కోసం 9494006092 నంబర్ గల కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చని ఆయన తెలియజేశారు.

# మారుమూల గిరిజన గ్రామం కిండంగి లో కలెక్టర్ ఆకస్మిక పర్యటన





- 2027 జనాభా గణనలో ప్రజల భాగస్వామ్యం అవసరం
- జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్

**గంగవరం /రాజవొమ్మంగి, పెన్ పవర్, మే 13** : పోలవరం జిల్లాలో ప్రతి గ్రామంలో ప్రతి పౌరుడు ఇంటింటికి వచ్చే ఎన్యూమరేటర్లకు తమ కుటుంబ వివరాలు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన రాజవొమ్మంగి మండలం లోదొడ్డి పంచాయతీలోని మారుమూల గిరిజన గ్రామం కిండంగిని ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. 10 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జనగణన (సెన్సస్)పై ప్రజలకు అవగాహన కల్పించే విధానాన్ని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 2027 జనాభా గణనలో భాగంగా మొదటి విడత ఇంటింటి సెన్సస్ జాబితా నిర్వహణ మే 1 నుండి మే 30 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ సర్వేలో ఇంటి స్థితిగతులు, కుటుంబ వివరాలు నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు. అందించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పనకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. మొదటిసారిగా ఈ జనగణన డిజిటల్ విధానంలో నిర్వహించబడుతోందని తెలిపారు. జనగణనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఇంటింటికీ వచ్చే అధికారులకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. జనగణన చట్టం--1948 ప్రకారం జనగణనలో పాల్గొనడం ప్రతి పౌరుని బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. దేశ ప్రగతికి అందరి సహకారం అవసరమని పేర్కొన్నారు. కిండంగి గ్రామ ప్రజలు లోదొడ్డి నుండి కిండంగి వరకు నాలుగు కిలోమీటర్ల రహదారి ఏర్పాటు, త్రాగునీటి సదుపాయం, పూర్తి స్థాయి విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతిపత్రం అందజేశారు. సమస్యలపై వెంటనే స్పందించిన కలెక్టర్, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే పోలవరం జిల్లాలో ప్రతి నీటి బొట్టును వృథా కాకుండా భూగర్భ జలాలు పెంపొందించేందుకు 'జలధార', 'జల హారతి' కార్యక్రమాలను ఉపాధి హామీ నిధులతో అమలు చేయనున్నట్లు తెలిపారు. వర్షపు నీటిని చెరువులు, చెక్‌డ్యామ్‌లు, ఫీడర్ ఛానళ్లకు మళ్లించే చర్యలు చేపడతామని వివరించారు. కలెక్టర్ గ్రామస్తులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లోదొడ్డి నుండి కిండంగి వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల దూరాన్ని మోటార్‌సైకిళ్లపై ప్రయాణించి ఆయన గ్రామాన్ని చేరుకున్నారు.

ఈ పర్యటనలో ఐటీడీఏ ఏపీవో (జనరల్) డీఎన్‌వీ రమణ, తాసిల్దార్ ఎ. సత్యనారాయణ, ఎంపీడీవో యాదగిరి ఈశ్వరరావు, ఈఈలు ఐ. శ్రీనివాసరావు, రవికుమార్, సింగయ్య, మాజీ సర్పంచ్ లోత రామారావు, డాక్టర్ పావని, సబ్ ఇన్స్పెక్టర్ చిన్ని బాబు, ఏపీడీఎల్ రాంబాబు, ఉపాధి హామీ పథకం ఏపీవో బి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# కిషోర్ బాలికల్లో ఆరోగ్య చైతన్యం పెంపుకు ఐసిడిఎస్ చర్యలు






**కొత్తపేట,పెన్ పవర్, మే 13** :కొత్తపేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని వానపల్లి సెక్టార్‌లో కిషోర్ బాలికల ఆరోగ్యాభివృద్ధి లక్ష్యంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సీడీపీఓ ఎ. గజ్జలక్ష్మి ఆదేశాల మేరకు సూపర్వైజర్ హిమశ్రీ ఆధ్వర్యంలో వానపల్లి, వాడపాలెం-2, కంద్రిగ, బిళ్లకుర్రు గ్రామాల్లో ఈ శిక్షణ సదస్సులు చేపట్టారు. కిషోర్ బాలికల శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తున్న ఈ సమావేశాల్లో నాలుగో వారానికి సంబంధించిన కంద్రిగలో "నా అవసరాలు -- మన సవాళ్లు" అంశంపై ప్రత్యేక చర్చ జరిగింది. గ్రామం, పాఠశాల, సమాజంలో బాలికలు ఎదుర్కొనే వ్యక్తిగత, సామూహిక సమస్యలను అర్థం చేసుకునే విధంగా వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్యంగా రక్తహీనత (అనీమియా) సమస్యపై వైద్యపరమైన సూచనలు అందించారు. శరీరంలో ఐరన్ లోపం ఏర్పడితే అలసట, బలహీనత, తలనొప్పి, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు తలెత్తుతాయని వివరించారు. అందువల్ల బాలికలు ప్రతిరోజూ ఆకుకూరలు, పప్పుధాన్యాలు, గుడ్లు, పాలు, పండ్లు వంటి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా వ్యక్తిగత పరిశుభ్రత, శుభ్రమైన నీటి వినియోగం, సమయానికి ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడం, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన అలవాట్లు చిన్న వయస్సులోనే అలవరుచుకుంటే భవిష్యత్తులో అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు.

సూపర్వైజర్ హిమశ్రీ మాట్లాడుతూ, కిషోర్ బాలికలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

# నేడు అధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం -- వాతావరణ శాఖ హెచ్చరిక



అప్రమత్తంగా ఉండాలనుకున్న జిల్లా కలెక్టర్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ,మే 13:** గురువారం (మే 14) అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. పోలవరం జిల్లాలో తీవ్ర ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ సూచించారు. మధ్యాహ్న సమయంలో అవసరం లేకుండా బయటకు రావద్దని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. తగినంత తాగునీరు తీసుకోవాలని, వృద్ధులు, చిన్నారులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వడదెబ్బ (హీట్ స్ట్రోక్) లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని అధికారుల తరఫున సూచించారు. జిల్లాలోని అన్ని వైద్య కేంద్రాలను అప్రమత్తం చేసినట్లు సమాచారం. మెడికల్ ఆఫీసర్లు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ సరిత ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు అవసరమైన జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అధికారులు కోరారు.

# హనుమాన్ జయంతి వేడుకల్లో రెండో రోజు భజన కార్యక్రమం

భక్తి పరవశంలో గంగవరం



**గంగవరం, పెన్ పవర్ మే 13** :హనుమాన్ జయంతి వేడుకల సందర్భంగా రెండో రోజు బుధవారం గంగవరం గ్రామంలో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు. అడ్డతీగల భజన బృందం ఆదినారాయణ, నాని, వాసు ఆధ్వర్యంలో, భక్తి మండలి పట్నాయక్ మాస్టారు, ప్రసాద్ తదితరులు కార్యక్రమాన్ని సమన్వయంతో నిర్వహించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో సాగిన ఈ భజన కార్యక్రమంలో హనుమాన్ స్తోత్రాలు, భక్తి గీతాలు ఆలపించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. గ్రామ ప్రజలు, యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం

# రోడ్డుపై ఇసుక తొలగించి ప్రమాదాలు నివారించిన హెడ్ కానిస్టేబుల్‌కు ప్రశంసలు



**కాకినాడ, పెన్ పవర్,మే 13**: కాకినాడ జడ్పీ సెంటర్ వద్ద రోడ్డుపై పడిన ఇసుకను స్వయంగా తొలగించి ప్రమాదాలను నివారించిన ట్రాఫిక్ పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. సాయంత్రం ట్రాఫిక్-1 పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎస్. షణ్ముఖరావు విధులు నిర్వహిస్తుండగా,రోడ్డుపై ఇసుక పడి ఉండటంతో ద్విచక్ర వాహనదారులు స్కిడ్ అయి ప్రమాదాలకు గురవుతున్న విషయాన్ని గమనించారు. వెంటనే స్పందించిన ఆయన స్వయంగా చీపురుతో ఇసుకను తొలగించి రహదారిని సురక్షితంగా మార్చారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ హెడ్ కానిస్టేబుల్ షణ్ముఖరావును అభినందించారు. విధి నిర్వహణలో భాగంగా మానవత్వంతో స్పందించి ప్రమాదాలను అరికట్టిన ఆయన సమయస్ఫూర్తిని ప్రజలు, ఉన్నతాధికారులు ప్రశంసించారు. ఇటువంటి సేవా దృక్పథం ఇతర పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తుందని జిల్లా పోలీసు యంత్రాంగం పేర్కొంది.

# వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు బెయిల్ రద్దు



హత్య కేసు సాక్షులను బెదిరించిన కేసులో నిరూపణ

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మే 13:** దళిత యువకుడు డ్రైవర్ సుబ్రమణ్యం హత్య , డోర్ డెలివరీ కేసులో ప్రధాన నిందితుడు అనంతబాబుకు తూర్పుగోదావరి జిల్లా ప్రత్యేక కోర్టు బుధవారం జరిగిన విచారణలో బెయిల్ రద్దు చేసింది. ఇదే కేసులో అనంతబాబుకు గతంలో సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిల్ ఇచ్చిన సంగతి విధితమే. దళిత యువకుడు సుబ్రమణ్యం హత్యకేసులో నలుగురు సాక్షులను అనంతబాబు, అతని అనుచరులు ప్రలోభపెట్టడం తో పాటు సాక్ష్యం చెప్పకపోతే చంపేస్తామని ఒక అపార్ట్మెంట్లో గత నెలలో సాక్షులను బెదిరించారు. దాంతో భయపడిన సాక్షులు కాకినాడ జిల్లా సర్పవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది. కేసు నమోదు చేసిన సర్పవరం పోలీసులు సాక్షులను బెదిరించిన కేసులో అనంత బాబును ఏప్రిల్ 24 న అరెస్టు చేసారు. ఆ కేసులో ప్రస్తుతం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో అనంతబాబు రిమాండ్ ఖైదీగా ఉన్నారు. హత్య కేసులో బెయిల్ పై ఉంటూ సాక్షులను బెదిరించడాన్ని తీవ్రంగా పరిగణించిన కోర్టు సాక్షులను బెదిరించినట్లు ఆధారాలతో నిరూపణ కావడంతో బెయిల్ రద్దు చేసింది. సుప్రీం కోర్టు బెయిల్ షరతులను, నిబంధనలను ఉల్లంఘించి నందుకు అనంత బాబు బెయిల్ రద్దు చేయాలని పోలీసుల తరపున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముప్పాళ్ళ సుబ్బారావు పిటీషన్ దాఖలు చేయడమే కాక వాదనలు వినిపించారు. బెయిల్ రద్దు అవడంతో హత్య కేసు విచారణ పూర్తయ్యేవరకు జైలులోనే అనంతబాబు ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈనెల 20 నుంచి డ్రైవర్ హత్యకేసు రెగ్యులర్ విచారణ ప్రారంభించనున్నట్లు కోర్టు వర్గాలు తెలిపాయి.

# దివంగత తెలుగు రైతు మండల అధ్యక్షులు చిట్యాల అప్పారావు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గండేపల్లి, పెన్ పవర్, మే, 13**:గండేపల్లి మండల తెలుగు రైతు అధ్యక్షులుగా సేవలందించిన నీలాద్రి రావుపేటకు చెందిన సీనియర్ టీడీపీ నాయకులు చిట్యాల అప్పారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే.

ఈ విషయం తెలుసుకున్న తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ బుధవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దివంగత అప్పారావు కుమారుడు, టీడీపీ నాయకులు చిట్యాల బాబ్జి, కోడలు, మాజీ ఎంపీటీసీ చిట్యాల గీతతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అప్పారావు గారి సేవలు, పార్టీకి ఆయన చేసిన కృషిని ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పార్టీ ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, గండేపల్లి మండల టీడీపీ అధ్యక్షులు పోతుల మోహనరావు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కందుల చిట్టిబాబు, టీడీపీ నాయకులు దార బల్ల సద్గురు మూర్తి, నక్క కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహణ



**కాకినాడ, పెన్ పవర్, మే 13:** కాకినాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని కాకినాడ అర్బన్, కాకినాడ రూరల్, తాళ్లరేవు, పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టులలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 61 పోస్టులకు గాను 152 మంది అభ్యర్థినులు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థినులకు నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలు పారదర్శకంగా నిర్వహించబడినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రెవెన్యూ డివిజన్ అధికారి, జిల్లా మెడికల్ అండ్ హెల్త్ అధికారి, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారితో పాటు సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టుల సీడీపీవోలు పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు,గర్భిణులు,బాలింతలకు మెరుగైన సేవలు అందించేందుకు ఖాళీ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

